
APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ ఆదివారం 02 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :66 పేజీలు : 04 వెల: 2-00/-



## డీఎంఈగా డా. వాణికి శుభాకాంక్షలు

- ఆరోగ్య మంత్రిని కలిసిన డీఎంఈ డా. ఎన్. వాణి
- కొత్త బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందనలు
- వైద్య విద్యాభివృద్ధిపై మంత్రి ఆశాభావం
- ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్ష

హైదరాబాద్, ఆగస్టు 1: తెలంగాణ వైద్య విద్య సంచాలకురాలిగా (డీఎంఈ) బాధ్యతలు స్వీకరించిన డా. ఎన్. వాణి శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి, కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. డీఎంఈగా బాధ్యతలు చేపట్టిన డా. వాణిని మంత్రి అభినందిస్తూ, ఆమె అనుభవం, నిబద్ధత తెలంగాణలో వైద్య విద్యను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య విద్యతో పాటు ఆరోగ్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో వైద్య విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, నాణ్యమైన వైద్య విద్య, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవల అందుబాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. వైద్య విద్యా వ్యవస్థను ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వైద్య విద్యలో నాణ్యత పెంపు, సేవల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డా. వాణి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రాష్ట్ర వైద్య విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి సమక్షంలో తెలిపారు.

## ఉత్తరాంధ్రకు రెక్కలొచ్చాయి

- భోగాపురం విమానాశ్రయంతో కల సాకారమైందన్న మంత్రి లోకేశ్
- ప్రధాని మోదీ సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైందని వ్యాఖ్య
- ఉత్తరాంధ్రను ఎగతాళి చేసిన వారికి ఘాటు సమాధానం
- రాష్ట్రానికి పవర్ ఇంజిన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు

విజయనగరం, ఆగస్టు 1 : భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు "ఎర్ర బస్సు కూడా రాని ప్రాంతానికి ఎయిర్‌బస్ అవసరమా?" అంటూ ఎగతాళి చేసిన చోటే ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని పేర్కొన్నారు. గతంలో ఉత్తరాంధ్రను తక్కువగా చూసి, ఇక్కడి ప్రజలను అవమానించిన వారు ఇప్పుడు జరిగిన అభివృద్ధిని చూసి సమాధానం తెలుసుకోవాలని మంత్రి వ్యాఖ్యానించారు. "ఎర్ర బస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది.. మన ప్రధాని మోదీ వచ్చారు. ఇదే మన ఉత్తరాంధ్ర దెబ్బ" అంటూ ప్రత్యర్థులను ఉద్దేశించి విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల కలలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాకారం చేశారని లోకేశ్ కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని, రాష్ట్ర పురోగతికి ప్రధాని పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. "నమో" అంటే ధైర్యం, నమ్మకం, సురక్షిత భారతానికి ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో పనిచేస్తున్నాయని, అదే ఫలితంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందని వివరించారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలకంగా మారుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, పర్యాటక రంగానికి ఇది కొత్త ఊపునిస్తుందని, రాష్ట్ర




ఆర్థికాభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం పవర్ ఇంజిన్‌లా పనిచేస్తుందని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేసిన జీఎంఆర్ సంస్థను మంత్రి అభినందించారు.




## ధవళేశ్వరం వద్ద తొలి హెచ్చరిక

- 10 లక్షల క్యూసెక్కులు దాటిన గోదావరి వరద ప్రవాహం
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తొలి ప్రమాద హెచ్చరిక జారీ
- భద్రాచలం వద్ద కొనసాగుతున్న మూడో ప్రమాద హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

రాజమహేంద్రవరం, ఆగస్టు 1 : ఎగువ రాష్ట్రాలు, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నదికి వరద ఉద్ధృతి అంతకంతకూ పెరుగుతోంది. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో ఆ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లోని ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీపై స్పష్టంగా కనిపిస్తోంది. బ్యారేజీ వద్ద వరద ప్రవాహం 10 లక్షల క్యూసెక్కులు దాటడంతో జలవనరుల శాఖ అధికారులు శనివారం తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. జలవనరుల శాఖ వివరాల ప్రకారం, శనివారం ఉదయం 10 గంటల నాటికి ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.75 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం బ్యారేజీలోకి 10.01 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవేశిస్తుండగా, అదే స్థాయిలో నీటిని దిగువకు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ప్రైవేట్ బస్సులపై తనిఖీలు





**ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు**
**ఎస్పీ ఆదేశాలతో విస్తృత తనిఖీలు**
**నిబంధనలు పాటించని వారిపై చర్యలు**
**రోడ్డు భద్రతపై పోలీసుల దృష్టి**

బాపట్ల, ఆగస్టు 1 : ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ బాపట్ల జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ప్రైవేట్ వాహనాలు, ట్రావెల్స్ బస్సులపై జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాహనాలకు సంబంధించిన అనుమతులు, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు, బీమా, డ్రైవింగ్ లైసెన్సులు, అత్యవసర భద్రతా పరికరాలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ప్రయాణికుల భద్రతకు భంగం కలిగించే లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని వాహన నిర్వాహకులకు సూచించారు. అధిక వేగం, ఓవర్‌లోడింగ్, నిబంధనల ఉల్లంఘన వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పోలీసులు తెలిపారు. అందువల్ల అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వాహన యజమానులు, డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచడంతో పాటు ప్రమాదాలను నివారించడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా సురక్షిత ప్రయాణానికి సహకరించాలని, నిబంధనలు పాటించని వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని పోలీసులు స్పష్టం చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణికుల రక్షణ కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని బాపట్ల జిల్లా పోలీసు అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు



## భోగాపురం క్రెడిట్ మాదే: వైసీపీ

- విమానాశ్రయ ప్రారంభంపై వైసీపీ స్పందన
- జగన్ హయాంలోనే ప్రాజెక్టుకు పునాది పడిందని వెల్లడి
- భూసేకరణ, అనుమతులు తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని వ్యాఖ్య
- క్రెడిట్‌ను కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని ఆరోపణ

అమరావతి, ఆగస్టు 1 : భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించిన నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఈ ప్రాజెక్టు సాకారమవ్వడం పట్ల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోనే ఈ ప్రాజెక్టుకు బలమైన పునాది పడిందని పార్టీ పేర్కొంది. భోగాపురం విమానాశ్రయాన్ని కల నుంచి నిజం చేసే దిశగా తీసుకెళ్లిన నాయకత్వం జగన్ ప్రభుత్వానిదేనని వైసీపీ తెలిపింది. ప్రాజెక్టు అమలులో తమ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని పేర్కొంటూ, ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎలాంటి పాత్ర లేకుండానే మొత్తం ఘనతను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. జగన్ ప్రభుత్వ హయాంలోనే విమానాశ్రయం కోసం సుమారు రూ. 1,200 కోట్ల వ్యయంతో భూసేకరణ పూర్తి చేశామని వైసీపీ వెల్లడించింది. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించడం, ప్రాజెక్టు అమలుకు అవసరమైన కీలక చర్యలను తమ ప్రభుత్వమే చేపట్టిందని పేర్కొంది. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన పర్యావరణ, విమానయాన శాఖల అనుమతులను కూడా జగన్ ప్రభుత్వ హయాంలోనే వేగంగా సాధించామని వైసీపీ తెలిపింది. అలాగే విమానాశ్రయానికి అనుసంధానంగా అవసరమైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా తమ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని పేర్కొంది. ఈ ప్రాజెక్టు విజయానికి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర లేదని వైసీపీ విమర్శించింది.

అనంత సూర్య
తెలుగువార్త



# ఛలో ఢిల్లీ పోస్టర్ విడుదల - సాకే నరేష్




అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య : బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ మాట్లాడుతూ.. ఈనెల 5, 6 తేదీలలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఢిల్లీలోని కేంద్ర మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్స్ కల్పించాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్స్ కల్పించాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్స్ కల్పించాలని, కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ చేతివృత్తి కులాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, సామాజిక న్యాయం, ఉపాధి కేంద్రాలు, రైతులు, కార్మికుల సమస్యలు, న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి తదితర సమస్యలపై ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందనీ, సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది రంగనాయకులు, బీసీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, జిల్లా కార్యదర్శి కె. నరేష్, గోపాల్, ప్రకాష్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పీవీకేకేలో ముగిసిన ఏఐ అండ్ సైబర్ సెక్యూరిటీ ప్రాజెక్ట్ ఎక్స్‌పో

## - 55కు పైగా ఏఐ ఏజెంట్ల ప్రదర్శన - విజేతలకు బహుమతుల ప్రదానం



అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య : పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అనంతపురంలోని కార్పొరేట్ రెడీనెస్ ట్రైనింగ్ సెల్ (సీఆర్టీ), మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మరియు కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు వారాల ఏఐ అండ్ సైబర్ సెక్యూరిటీ ప్రాజెక్ట్ ఎక్స్‌పో శనివారంతో విజయవంతంగా ముగిసింది. జూలై 20న ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ట్రైనర్లు అరవింద్, దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రెండు వారాల పాటు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ టూల్స్, ఏఐ ఏజెంట్ల రూపకల్పన, ప్రాంప్ట్ ఇంజినీరింగ్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో విద్యార్థులు రూపొందించిన 55కు పైగా ఏఐ ఏజెంట్లు, వినూత్న ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల పరిపాలన, విద్యార్థుల అభ్యాసం, ప్లేస్‌మెంట్లు, భద్రత వంటి విభాగాలకు ఉపయోగపడే అనేక వినూత్న పరిష్కారాలను విద్యార్థులు తమ ప్రాజెక్టుల ద్వారా ప్రదర్శించారు. ప్రత్యేకంగా ఏఐ క్యాంపస్ అసిస్టెంట్, స్మార్ట్ అటెండెన్స్ అండ్ ఫేస్ రికగ్నేషన్ సిస్టం, సైబర్ థ్రెట్ డెటికేషన్ ఏజెంట్, ఏఐ ప్లేస్‌మెంట్ గైడెన్స్ బోట్ వంటి ప్రాజెక్టులు సందర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ కిషోర్ పల్లె మాట్లాడుతూ.. విద్యార్థులు రూపొందించిన ఏఐ ప్రా-జెక్టులు భవిష్యత్తులో విద్యాసంస్థల అభివృద్ధికి, పరిశ్రమల అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు మాట్లాడుతూ.. సిద్ధాంతపరమైన జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల కెరీర్‌కు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు, పీవీకేకే ఐటీ కార్పొరేట్, ప్లేస్మెంట్ ట్రైనర్ వహీదా, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ట్రైనర్లు అరవింద్, దుర్గారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా: సిడిపిఓ జయంతి




కొత్తచెరువు, ఆగస్టు 01, అనంత సూర్య: తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని అందించే మొదటి టీకా లాంటివని పుట్టపర్తి సీడీపీఓ ఏ. జయంతి పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పిడి ఆదేశాల మేరకు, కొత్తచెరువు మండలం పోతులకుంట పంచాయతీ పరిధిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయ్యగారి రజిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీడీపీఓ జయంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవ-సరమని స్పష్టం చేశారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, కనీసం నీరు గానీ, ఇతర ఆహార పదార్థాలు గానీ ఇవ్వకూడదని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించి, రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. ఆరు నెలల తర్వాత పౌష్టికాహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని వెల్లడించారు. తల్లిపాల విశిష్టతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీడీపీఓ తెలిపారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, పోతులకుంట అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బలక్ష్మి, లీలావతి, మాధవి, శ్రావణి, సరోజ, గీత, లక్ష్మీదేవి, ఆశా కార్యకర్త రమాదేవి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భ్రూణ హత్యల నిరోధానికి స్పెషల్ బ్రాంచ్ నిఘా సేవలు వినియోగించాలి

**• స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక పర్యవేక్షణకు కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశం**



అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య: భ్రూణ హత్యలను అరికట్టేందుకు, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచేందుకు పోలీస్ స్పెషల్ బ్రాంచ్ సేవలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీసీ--పీఎన్‌డీటీ చట్టం అమలు కమిటీ జిల్లా సా-థయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ఎల్లనూరు, వజ్రకరూరు మండలాల్లో జరిగిన గర్భస్రావాలపై ప్రత్యేక విచారణ చేపట్టి, కారణాలను విశ్లేషించి నివేదిక సమర్పించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ జరిగినట్లు తేలితే సంబంధిత స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం ఏఆర్టీ ఉ సరోగసీ చట్టం--2021 అమలుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉన్న 12 ఏఆర్టీ ఆస్పత్రులను తనిఖీ చేసి, ఆన్‌లైన్ ఫిర్యాదుల నమోదు వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి సత్యవాణి, ఫోక్సో కోర్టు జడ్జి చినబాబు, డీఎంహెచ్ఓ డా. కట్టా వెంకటేశ్వర్లు, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ డా. దుర్గేష్, ఇతర కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ గ్రంథాలయ యాప్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

**అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు**






అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ను ప్రతి ఒక్కరికీ చేరువ చేసే లక్ష్యంతో ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాన్ని సందర్శించే పాఠకులు తమ మొబైల్ ఫోన్లలో యాప్‌ను సులభంగా డౌన్‌లోడ్ చేసుకునేలా నోటీస్ బోర్డుపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. అలాగే యాప్ ద్వారా గ్రంథాలయ సేవలు, పుస్తకాల వివరాలు, సభ్యత్వం, ఇతర సౌకర్యాలను ఎలా పొందాలో విద్యార్థులు, పాఠకులకు వివరించారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించగా, గ్రంథాలయ సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి పి. కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్లు డి. గోవిందు, శిరీష కుమారి, సరస్వతమ్మ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ కూటమి కార్యక్రమంలో పాల్గొన్న సభావత్ సోమ్లా నాయక్

**• ఇంటింటికీ కూటమి కార్యక్రమంలో పాల్గొన్న సభావత్ సోమ్లా నాయక్**



నల్లమాడ, ఆగస్టు 1 అనంత సూర్య: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నల్లమాడ మండల కేంద్రం, కొండ్రవారిపల్లి గ్రామంలో నిర్వహించారు. ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు సభావత్ సోమ్లా నాయక్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం "ఇంటింటికీ కూటమి -- డోర్ టు డోర్" కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సభావత్ సోమ్లా నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజనప్ప, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, మైలే శంకర్, అరవింద్ బాబు, కూటమి నాయకులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్య పనుల్లో నాణ్యత పెంపే లక్ష్యం



**ఉమ్మడి అనంతపురం పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈగా నాగిరెడ్డి బాధ్యతల స్వీకరణ**

అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గ్రామీణ రహదారులు, భవన నిర్మాణ పనుల్లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించేలా కృషి చేస్తానని ఉమ్మడి అనంతపురం జిల్లా పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఈదుల నాగిరెడ్డి తెలిపారు. కర్నూలు జిల్లా పాణ్యం డీఈఈగా విధులు నిర్వహిస్తున్న నాగిరెడ్డి ఇటీవల ఉద్యోగోన్నతిపై ఈఈగా పదోన్నతి పొంది అనంతపురం క్వాలిటీ కంట్రోల్ విభాగానికి నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించగా, డీఈఈలు ఆవుల లోకన్న, గోపాల్ నాయక్, ఓబులదాస్, ఏఈఈలు భాస్కర్, సంగీతతో పాటు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, 1992లో ఏపీపీఎస్సీ ద్వారా ఏఈఈగా ప్రభుత్వ సేవలో చేరిన తాను నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో పనిచేసినట్లు తెలిపారు. అనంతరం రాజీవ్ స్వగృహ, ఎస్ఎస్ఏ, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో డీఈఈగా సేవలందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈఈగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

# ఆర్‌బీఎస్‌కే 2.0 హెల్త్ స్క్రీనింగ్‌ను విజయవంతం చేయాలి

**సమన్వయంతో పనిచేయాలని అధికారులకు కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశం**



అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య: ఆర్‌బీఎస్‌కే 2.0 (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం)ను విజయవంతంగా అమలు చేసేందుకు ఆరోగ్య, ఐసీడీఎస్, విద్యాశాఖతో పాటు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా 0 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, జన్యుపరమైన లోపాలు, పోషకాహార సమస్యలు, ఎదుగుదల లోపాలు, ఇతర వ్యాధులను ముందుగానే గుర్తించి ఉచిత చికిత్స, రిఫరల్ సేవలు అందించనున్నారు. అనంతపురం జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,19,002 మంది, పాఠశాలల్లో 2,04,205 మంది విద్యార్థులు కలిపి మొత్తం 3,23,207 మంది చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. కె. వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ ఎస్. సాజిదా బేగం, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎస్.బి. విష్ణుమూర్తి, మేనేజర్ డి. రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రబస్సు వస్తుందా అన్నావ్.. ఇప్పుడు విమానాలు వస్తున్నాయ్ చూడు

- భోగాపురంపై జగన్ వ్యాఖ్యల మీద ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం
- నగరంలో పింఛన్ల పంపిణీ, ఇంటింటికీ ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే
- అనంతపురంలో ఒక పెద్దమనిషి ఉనికి కోసం మెగా డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్నారు
- మేము చేసిన అభివృద్ధిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్న ఎమ్మెల్యే దగ్గుపాటి





అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య : భోగాపురంకి ఎర్రబస్సు అయినా వస్తుందా అన్న జగన్ రెడ్డి.. ఈరోజు భోగాపురం ఎయిర్ పోర్ట్ నేను తెచ్చానంటున్నాడని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మండిపడ్డారు. అసలైన క్రెడిట్ చోర్ జగన్ రెడ్డి మాత్రమేనని ఆయన కామెంట్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీతో పాటు ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ టిడిపి అబ్జర్వర్ దేవేంద్రప్ప, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా 40వ డివిజన్ ఆజాద్ నగర్‌లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. అనంతపురం నూతన సీసీ రోడ్డు భూమిపూజ చేశారు. ఆ తర్వాత 7వ డివిజన్ వేణుగోపాల్ నగర్‌లో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకి మహిళలు మంగళహారుతులతో ఘన స్వాగతం పలికారు. భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దివ్యాంగులు, వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తూ.. రెండేళ్లలో చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. రెండేళ్లలో మేము చేసిన అభివృద్ధి సగర్వంగా ప్రజలకు చెబుతున్నామని, వైసీపీ నాయకులకు చెప్పుకునేకి ఏమీ లేక వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. అనంతపురంలో ఒక పెద్దమనిషి మెగా డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్నారని.. ప్రతి రోజు ఏదో నిరసన అంటూ బయలుదేరుతున్నారని విమర్శలు చేశారు. ఆయన్ని ప్రజలు మరిచిపోయారనే ఇలాంటివి చేస్తున్నారన్నారు. నగరంలో గత ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదన్నారు. రెండేళ్లలోనే 200కోట్లతో రోడ్లు, డ్రైన్లు ఇతర మౌళిక వసతులు కల్పించామని.. వేము చేసిన అభివృద్ధిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కేవలం 150రోజుల్లోనే మెగా డీఎస్సీని ఎలా వివాదాలకు తావు లేకుండా పూర్తి చేసి 16347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. గత ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకుండా ఉపాధ్యాయులు బాత్ రూమ్ లు, వైన్ షాపుల వద్ద కాపలాగా పెట్టారన్నారు. జగన్ రెడ్డి ఐదేళ్లలో అమరావతితో మూడుముక్కలాటలు ఆడారన్నారు. ఇప్పుడు అమరావతిలో వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని.. 2029కి ఒక అద్భుతమైన నగరంగా అమరావతి ఉంటుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం 70శాతం పూర్తి చేస్తే.. జగన్ రెడ్డి వచ్చాక దాన్ని గాలికి వదిలేశారన్నారు. గోదావరి పుష్కరాల్లోపు పోలవరాన్ని పూర్తి చేస్తారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ ను అనతి కాలంలోనే నిర్మించి దేశంలోనే నెంబర్ -1 నిలిపారన్నారు. మొదటి ఏడాది 60లక్షలు, రెండవ ఏడాది 4కోట్ల మంది ప్రయాణించే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఇక్కడ ఎర్ర బస్సు కూడా రాదని చెప్పిన జగన్మోహన్ రెడ్డి.. ఇప్పుడు దీనిని నేనే తెచ్చానని జగన్ చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. సీఎం చంద్రబాబు ఏది చేసినా ప్రపంచానికే రోల్ మోడల్ గా ఉంటుందన్నారు. ఇంత అద్భుతమైని ఎయిర్ పోర్టును నిర్మించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజల తరుఫున ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# బీజేపీ కూడేరు మండల అధ్యక్షులుగా బోయ గోపాల్ నియామకం

## - ప్రకటించిన జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్





అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య : బీజేపీ కూడేరు మండల అధ్యక్షులుగా బోయ గోపాల్ ను నియమించారు. శనివారం స్థానిక జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కూడేరు మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ హాజరయ్యారు. కూడేరు మండల అధ్యక్షులుగా బోయ గోపాల్ ను నియమిస్తున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన బిజెపి కూడేరు మండల అధ్యక్షులు బోయ గోపాల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతను ఇచ్చిన బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మండలంలోని సీనియర్ నాయకులకు, తోటి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి బిజెపి కార్యకర్తను కలుపుకొని భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికై కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులుగా జశ్వంత్ వ్యాస్ ఏకగ్రీవ ఎన్నిక





అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య : మత్స్యకార సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా మత్స్యకార సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక కోర్టు రోడ్డులోని ఆరఎసఎస్ కార్యాలయంలో మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షులుగా జశ్వంత్ వ్యాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా బెస్త వెంకటేష్, బెస్త విజయ సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బెస్త పవన్ కుమార్, నగర అధ్యక్షులుగా బెస్త అశోక్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శిగా బెస్త రాఘవేంద్రలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు, మత్స్యకార ప్రతినిధులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానని, ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలు, సంక్షేమ పథకాలను సక్రమంగా అందేలా చూస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి అప్పగించినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంగముని, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోటా రాజేశ్వరి, జిల్లా గౌరవాధ్యక్షులు పిల్లి రవీంద్రలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మేక చంద్రబాబు, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎక్కలూరు నారాయణమూర్తి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన అధ్యక్షులు మనోజ్ కుమార్, మహిళా కమిటీ సభ్యులు మహేశ్వరి, మాజీ అధ్యక్షులు శివకుమార్, సభ్యులు పాపన్న, నాగేంద్ర, నవీన్, కిరణ్, వాసు, శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సహకారంతో చంద్రబాబు నాయకత్వంలో నవ్యాంధ్ర అభివృద్ధి



• భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మైలు రాయి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి, ఆగస్టు 1 అనంత సూర్య: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. భోగాపురంలో రూ.4,727 కోట్ల వ్యయంతో 2,407 ఎకరాల్లో నిర్మిస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆమె అన్నారు. విమానాశ్రయంతో పాటు 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 130 ఎకరాల్లో ఎడ్యుసిటీ ఏర్పాటుతో పారిశ్రామిక, విద్యా రంగాలు అభివృద్ధి చెందడంతో పాటు యువతకు భారీ స్థాయిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడిన ఆమె, రాష్ట్రంలో రూ.18 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం స్వర్ణాంధ్ర నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతోందని పేర్కొంటూ, రాయలసీమ అభివృద్ధికి కూడా కేంద్రం సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ రెన్యూవల్‌ను ఆగస్టు 31లోపు పూర్తి చేయాలి

అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య: 2022, 2023, 2024 సంవత్సరాల్లో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికై ప్రస్తుతం 10, 11, 12 తరగతుల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31లోపు స్కాలర్‌షిప్ రెన్యూవల్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా రెన్యూవల్ దరఖాస్తు సమర్పించి, సంబంధిత పాఠశాల నోడల్ అధికారి ఆమోదం పొందాలి. అనంతరం దరఖాస్తు ప్రింట్, స్టడీ సర్టిఫికేట్‌ను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని జిల్లా నోడల్ అధికారికి సమర్పించి తుది ఆమోదం పొందాల్సి ఉంటుంది. అలాగే బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసి, డీబీటీ ద్వారా స్కాలర్‌షిప్ జమయ్యేలా చూసుకోవాలని సూచించారు. గడువులోపు రెన్యూవల్ పూర్తి చేయని విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు కాదని స్పష్టం చేశారు.

# వాల్మీకి/బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



## భారీ ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య: వాల్మీకి/బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ మహర్షి వాల్మీకి సేవాదళ్ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. స్థానిక టవర్ క్లాక్ నుంచి పవర్ ఆఫీస్ సమీపంలోని మహర్షి వాల్మీకి విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని, వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్‌కు వాల్మీకి/బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ వినతిపత్రం



అందజేశారు. ఈ సందర్భంగా బోయ గిరిజమ్మ మాట్లాడుతూ, వాల్మీకి సమాజం ఇప్పటికీ సామాజిక గుర్తింపుకు నోచుకోలేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై నిర్లక్ష్య ధోరణి వీడి వెంటనే వాల్మీకి/బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ పామిడి వీరాంజనేయులు, వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకుడు అకులప్ప, వాల్మీకి సంఘ నాయకులు, కుల పెద్దలు, పెద్ద సంఖ్యలో వాల్మీకి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీఐఐసీ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

## పారిశ్రామిక అభివృద్ధిపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జేసీ మౌర్య భరద్వాజ్ సమీక్ష



పుట్టపర్తి, ఆగస్టు 1 అనంత సూర్య; శ్రీ సత్యసాయి జిల్లాలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశ్రామిక భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పరిహారం చెల్లింపులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పెనుకొండ, మడకశిర, ధర్మవరం డివిజన్లలో భూసేకరణ పురోగతి, పరిహారం చెల్లింపులు, పారిశ్రామిక పార్కుల ప్రతిపాదనలపై సమీక్షించారు. చిలమత్తూరు మండలం టేకులుడు గ్రామంలో ప్రభుత్వ, డీకేటీ, పట్టా భూముల సేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. లేపాక్షి మండలం కొండూరు గ్రామంలో పారిశ్రామిక పార్కు కోసం భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, కొత్తగా ప్రతిపాదించిన భూముల సేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మడకశిర డివిజన్‌లో గౌడనహల్లి గ్రామంలో ఎక్స్‌గ్రేషియా ప్రక్రియ, ధర్మవరం డివిజన్‌లో ముదిగుబ్బ మండలంలోని భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో ప్రతిపాదిత కొత్త పారిశ్రామిక పార్కులకు సంబంధించిన భూ లభ్యత (ఫీజిబిలిటీ) నివేదికలను త్వరగా సమర్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు. పారిశ్రామికాభివృద్ధికి భూసేకరణ కీలకమని, రైతుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించి పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం తగదు - 48 గంటల్లో శుభ్రం చేయాలి





## కర్నాటకనాగేపల్లిలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆకస్మిక తనిఖీ

పుట్టపర్తి, ఆగస్టు 1 అనంత సూర్య: డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కర్నాటకనాగేపల్లి ప్రాంతంలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన కలెక్టర్, రోడ్లపై పేరుకుపోయిన చెత్త, నిల్వ ఉన్న మురుగునీటిని పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 48 గంటల్లోపు చెత్తను పూర్తిగా తొలగించి, మురుగునీటిని ఖాళీ చేయాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ పనులను నిరంతరం పర్యవేక్షించాలని పుట్టపర్తి ఆర్డీఓ, స్పెషల్ ఆఫీసర్ పి. సువర్ణకు, దోమల నివారణకు ఫాగింగ్, పిచికారీ కార్యక్రమాలను వెంటనే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "డెంగ్యూ రహిత పుట్టపర్తి" సాధనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రత పాటించి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆగస్టు 3, 4 తేదీల్లో కియా ఇండియాలో ఉద్యోగ మేళా

- కౌశలం పోర్టల్‌లో నమోదైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, ఆగస్టు 1 అనంత సూర్య; శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా ఇండియాలో ఆగస్టు 3, 4 తేదీల్లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కౌశలం పోర్టల్‌లో నమోదు చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు కియా ఇండియా ప్రతినిధులు, క్వెస్ కార్ప్ ఆధ్వర్యంలో ఎన్ఏపీఎస్ శిక్షణార్థులుగా ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్లొమా, ఏదైనా బీటెక్, పీజీ పూర్తి చేసి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9876543210 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో ప్రతి అవ్వా-తాత ముఖంలో ఆనందం

## పుట్టపర్తి అభివృద్ధికి భారీ పెట్టుబడులు రానున్నాయి: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి





పుట్టపర్తి, ఆగస్టు 1 అనంత సూర్య: ప్రతి నెల ఒకటో తేదీన జరిగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీతో ప్రతి అవ్వా, తాత ముఖంలో ఆనందం కనిపిస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. శనివారం పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలో, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లకు పైగా కేటాయించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 5వ తరం ఫైటర్ జెట్ యూనిట్, ఆమడగూరులో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగ అవకాశాలు లభించి ప్రాంత రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు. అలాగే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదర్శపాఠశాలలో ఘనంగా వరల్డ్ స్కార్ఫ్ డే..




అగళి,ఆగస్టు 1,అనంత సూర్య: :అగళి మండల కేంద్రం నందు ఆదర్శపాఠశాలలో వరల్డ్ స్కార్ఫ్ డే సందర్భంగా స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులతో పాఠశాలలో స్కార్ఫ్ నినాదాలు మొక్కలు నటించడం,స్కార్ఫ్ యొక్క విలువలు విద్యార్థులకు ప్రిన్సిపాల్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఉపాధ్యాయులు బృందం మరియు స్కౌట్ మాస్టర్ నారాయణ స్వామి తెలియచేస్తూ స్కౌట్ ముఖ్యంగా విద్యార్థులలో క్రమశిక్షణ,మానసిక మరియు శరీరక ఉత్సవంతో భవిషత్తులో మంచి విలువలతో కూడిన విద్యాభ్యాసం విద్యార్థులు మంచి అవకాశాలు లభిస్తాయని తెలియచేయడం జరిగింది. అదేవిదంగా స్కౌట్ అండ్ గైడ్ ద్వారా ఈసంవత్సరంలో వెలువడిన త్రిబుల్ ఐటీ సీట్లలో గైడ్ వలన వారికీ త్రిబుల్ ఐటీ లో అవకాశం వచ్చాయి. ప్రభుత్వం నిర్వహించే ప్రతి ఎంట్రెన్స్ మరియు కంపిటేషన్ ఎక్సమ్ లో కూడా వీరికి ప్రతేక అవకాశాలు ఉంటాయి అని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.

# సీఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

## రిజర్వేషన్ సాధికార పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ ఉజ్వల్



అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య : అధికార మదంతో దళిత బహుజన నాయకుడు, న్యాయవాది శివరామకృష్ణను బూటికాళ్ళతో తన్ని అవమానించిన హిందూపురం సీఐ రాజగోపాల్ నాయుడుపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని రిజర్వేషన్ సాధికార పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ ఉజ్వల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిండు గర్భిణీ దళిత మహిళ కార్పొరేట్ హాస్పిటల్ నిర్లక్ష్యానికి బలై మరణించడం, ఆ మహిళ చావుకు కారణమైన కార్పొరేట్ ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన దళిత బహుజన లీడర్, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణపై బూటు కాళ్లతో తన్నుతూ కుల వివక్షత చూపిన హిందూపురం వన్ టౌన్ సీఐ రాజగోపాల నాయుడుపై ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసు అధికారి చట్టాన్ని ఉల్లంఘిస్తూ వ్యవహరించడం దారుణమని, ఇలాంటి చర్యలు పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. ఇలాంటి అధికారులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజాస్వామ్య బద్దంగా ఆందోళన చేపడతామని.. దళిత బహుజన బడుగు బలహీన వర్గాల సంఘాలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరఈఎఫ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ వైస్ చైర్మన్ వలగొండ రామకృష్ణ, రాయలసీమ అధ్యక్షుడు ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు ముత్యా రాజ్, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్‌కు శుభాకాంక్షలు



అనంతపురం, ఆగస్టు 1 అనంత సూర్య : జేఎన్టీయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ దుర్గాప్రసాద్‌ను నాన్‌టీచింగ్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ ఎండీ నాగభూషణం, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ పరశురాముడు, సెక్రటరీ పుష్పలత, నారాయణస్వామి, రజాక్, చిరంజీవి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో గంగాధర్




అగళి,ఆగస్టు1,అనంత సూర్య: అగళి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను పింఛన్ పంపిణీకర్ సక్రమంగా జరుగుతుందా లేదని పరిశీలిస్తూ మండల వ్యాప్తంగా అన్ని పింఛన్ పంపిణీ సచివాలయ కేంద్రాలలో గ్రామాలలో ఎంపీడీవో గంగాధర్ మండల వ్యాప్తంగా తిరుగుతూ పింఛన్ పంపిణీ సక్రమంగా పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశిస్తూ తాను కూడా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మకంగా వికలాంగులకు వితంతులకు వృద్ధులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్నటువంటి పింఛన్లు ఎలాంట టీ అవకతవకలు లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశించారు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో దాదాపుగా మండల వ్యాప్తంగా 80% పూర్తి అయిందిగా ఎంపీడీవో తెలిపారు ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి




ఉరవకొండ, ఆగస్టు 1 అనంత సూర్య : మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎసఎఫఐ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, వైయస్సార్ ఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మోడల్ స్కూలు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు గ్రామానికి చెందిన సుస్మిత, సోఫియా స్థానిక మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారని, వారు గురువారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో అదే మోడల్ స్కూల్‌కు చెందిన మరొక విద్యార్థి.. సుస్మిత, సోఫియాలపై బ్లేడుతో దాడి చేసి గొంతు కోయడానికి ప్రయత్నించిందన్నారు. బ్లేడు సరిగా తెగకపోవడంతో ఇద్దరి గొంతు కింద స్వల్ప గాయమై ప్రమాదం తృటిలో తప్పిందన్నారు. మరి ఇంతటి అఘాయిత్యం జరిగినప్పటికీ.. తల్లిదండ్రులకు, అక్కడున్న వార్డెన్ సమాచారం కూడా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. అక్కడున్న వార్డెన్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కలిసి సమస్యను తారుమారు చేయడానికి ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఇంతటి అఘాయిత్యం జరిగినప్పటికీ కనీసం విద్యార్థులకు హాస్పిటల్‌కి కూడా తీసుకువెళ్ళలేని పరిస్థితిని అక్కడున్న వార్డెన్, ప్రిన్సిపల్ కనపరిచారన్నారు. చివరికి తల్లిదండ్రులు వేరొకరి ద్వారా సమస్యను తెలుసుకొని అక్కడున్న ప్రిన్సిపల్, వార్డెన్ లను అడగగా, అక్కడి వార్డెన్ నల్లమ్మ.. మీ పిల్లల ప్రాణాలు పోలేదు కదా, ఏదో చిన్న గీత పడిందని నిర్లక్ష్యంగా మాట్లాడటం పట్ల తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యారన్నారు. మోడల్ స్కూల్లో, హాస్టల్లో సీసీ టీవీ ఫుటేజ్ కూడా పనిచేయకపోవడం దారుణమన్నారు. అలాగే విద్యార్థులు హాస్టల్లో నీటి సదుపాయం లేక తాగడానికి నీరు కావాలంటే తిరిగి స్కూలుకు వెళ్లి నీరు పట్టుకొని రావాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఈ హాస్టల్లో నెలకొందన్నారు. అర్ధరాత్రి సమయంలో కొండ ప్రాంతంలో ఉన్న ఈ హాస్టల్ ఎన్నో ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎసఎఫఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎం.హరూన్ రషీద్, నియోజకవర్గ నాయకులు రాజేష్, ప్రవీణ్, తిరుమలేష్, పవన్ బాబు, నాని, వైయస్సార్ ఎస్‌యు ఉరవకొండ నియోజకవర్గం పురుషోత్తం, జిల్లా కార్యదర్శి చిరంజీవి, ప్రిన్స్, అన్వర్, శ్యామ్ కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405